పాత పరిచయం

[కథానిక]

✽

= శ్రీ క్రొవ్విడి లింగరాజు =

సర్కారునౌకర్లకు ఆదివారం ఆటవిడుపురోజు. వారంపొడుగునా రోజువారీతంతు ఒక్కటేనాయిరి. ప్రొద్దున్నే లేవడం; కాగితాలు ముందేసుకు కూచోవడం; పదిగంటలు అయీఅవడంతోనే ఉడుకూ మిడుకూ రెండుమెతుకులు ఆదరాబాదరాగా నోట్లో వేసుకుని, యథాశక్తిగా వాహనంలోనో, నడకనో పడి ఆఫీసుకుచేరుకోవడం—ఇంతే. ఆప్యాయంగాఇల్లాలిచ్చిన తాంబూలాన్ని సేవించడానికిగాని, తిన్న మెతుకులు జీర్ణముఖాని కొచ్చేదాకా విశ్రాంతిపొందేందుకుగాని వాళ్లు నోచుకోలేదు. ఆసౌఖ్యమల్లా ఆదివారంనాడే. వారంలో జరగవలసిన ఇతరపనులన్నీ ఆ నాటికి వాయిదాపడవలసిందే. రోజూ పదిగంటలకు భోజనమైతే అవ్వేళ పండ్రెండుగంటలకు. రోజూ రాత్రి తొమ్మిదిగంటలకు పడకైతే ఆవేళ పండ్రెండు గంటలకు పడక. బంధువుల్ని, స్నేహితుల్ని చూడడం మొదలుకుని బజారుచిల్లరపనులవరకు ఆవేళ జరగవలసిందే. చాకలిమంగలిపండుగలు ఆరోజుకే. అంతేనా? ఎన్నాళ్లనుండో వాయిదాలుపడిన కంసాలికూడా ఆవేళకే. బంగారంవ్యవహారం పిసరంతయినా ఆఫీసరుకు తెలియకపోయినా ఆదివారంనాడు ఆయనఎదటే అమ్మగారు తూకం తూపించాలి. లోకల్‌బోర్డునంబర్లు వకాల్తీలమీద అటెస్టేషన్‌చేసినట్లే అయ్యగారుతూకం కట్టేలు నమూనాబంగారం పుచ్చుకోవాలి. అబ్బ! ఆదివారం శెలవంటారుకాని అంత హడావుడిరోజు అదే. చివరకు ఆవేళ జరగాలసిన ఇంటిపనులు ఎన్నో వాయిదాలుపడకతప్పదు. అమ్మగారిచేత కమ్మని మందలింపులూ తప్పవు.

శంకర్రావుపంతులు గుమాస్తాగిరీలోనుంచి జిల్లా మునసబైన ఉద్యోగస్థుడు. కేవలం కాగితాల కట్టలను భక్తిశ్రద్ధలతో ఆరాధించినందుకే ఆయనకు ఉద్యోగంలో అభివృద్ధి కలుగుతోంది. ఆయనా ఆదివారంనాటికి గంపెడుపనులు వాయిదా వేసుకుని బట్టల కొట్టుదగ్గర జట్కాబండిలో కూచున్నాడు. జట్కాబండిలో కూరగాయల బుట్టతోపాటు షాహుకారు అమ్మగారి ఆమోదంకోసం అలాయిదాగా ఇచ్చిన చీరెలు, రవికెల తానులు, పరికిణీగుడ్డలుకూడా సర్దుకుంటున్నాడు దఫేదారుసహాయంతో.

"ఏమోయి శంకప్పా" అని పిలుపు వినబడింది.

ఆపిలుపు వినేసరికి శంకర్రావుపంతులు ఉలికిపడినట్లయి తలెత్తి చూచాడు. ఎదుట అరవై సంవత్సరాల వయస్సు గల పెద్దమనిషి నిలబడ్డాడు. చుట్టు చెంగావిపంచె, హాలెండుచెక్కకోటు, లోపల బత్తాములులేనికమీజు, చేతిలోచిక్కపుసంచి, పదిజామిపళ్లు, జాళ్లడి జరీ కంగిపోయిన ఉప్పాడతలపాగ— సాక్షాత్తూ రిటైర్డు నాన్‌గెజెటెడు ఉద్యోగస్థుడు ప్రత్యక్షం అయినాడు. శంకర్రావును 'శంకప్పా'అని పిలిచేవాళ్లు చచ్చిపోయిన ఆయనతలితండ్రులు- బ్రతికున్నవాళ్లలో అన్నగారుమాత్రమే. అంచేత మరీ చకితుడైపోయాడు పంతులు.

"అవునోయి... పెద్ద ఉద్యోగస్థులు—మరచిపోరూ. జ్ఞాపకముంటామా మాబోంట్లు?"

శంకర్రావుపంతులుమనస్సు చురుక్కుమంది. చిన్న ఉద్యోగంలోనుంచి పైకొచ్చినవాడవడంచేతా,

ఇంకా పైకి రాదలచినవాడవడంచేతా తన్నుగురించి ఎవరైనా అల్లా అనుకుంటారేమోననే ఆయన కనుమానం.

"సరి సరి! ఎంతమాటన్నారు...త..."

"దానికేంలే! ఉద్యోగస్థులకి మరపు సహజమే. అయినా జ్ఞాపకం తెచ్చుకో! ఓయ్! చిన్నప్పుడు నాచేత ఎన్ని దెబ్బలు తిన్నావోయ్. అన్నట్లు రాముడు ఎక్కడున్నాడు? వాడిని చూచి ఎంతకాలమైందో? ఆయనకీ పెద్దఉద్యోగం అయివుండాలి! అతగాడికిమాత్రం జ్ఞాపకముంటామా! చిన్నప్పుడైతే ఒకకంచంలో తిని ఒక మంచంమీద పడుకున్నాం. కాని ఇప్పుడు ఆరోజులు జ్ఞాపకముంటాయా? ఇంతకూ అతని కేమైనా తాసిల్దారీ అయిందా?"

అప్రయత్నంగా పంతులు "రామన్నయ్య కడప జిల్లాలో డిప్యూటీకలెక్టరు" అన్నాడు.

"సరి. సరి. సంతోషం. పిల్లా మేకా అంతా బాగున్నారా?"

"ఆ. మీ దయవల్ల."

"దానికేం! భగవంతుడి దయ. సరి. మీఅమ్మ గంగమ్మత్త బాగుందా..." అంటూ చేతిలోని చిక్కపుసంచిని బండిచివర ఆన్చేడు.

పంతులు అప్రయత్నంగానే దాన్నందుకుని మిగతాసామాను సర్ది చిక్కానికీ, పెద్దమనిషికీకూడా చోటుచేశాడు.

"ఈవేళ మంచిరోజు మొత్తంమీద. చాలా కాలానికి నిన్ను చూడడం పడింది. ఎన్నాళ్లకి ఎన్నాళ్లకి...ఇప్పుడే పడవ దిగొచ్చాను. వస్తూంటే ఒక స్నేహితుడు ప్రస్తావవశాత్తు ఇల్లా మన శివరావుపంతులుగారి అబ్బాయి శంకర్రావు-జిల్లామునసబు వచ్చాడన్నాడు. 'అల్లాగా, శంకరప్పా!' అనుకుంటూ సరే తీరిగ్గా చూద్దామనుకుని, మా మేనమామకొడుకుగారింటికి బయల్దేరేను. ఇంతలో ఆడబోయిన తీర్థ మెదురైనట్లు బిళ్లబంట్రోతు కనుపించాడు. ఎంతకాలమైతే ఏమిటి చూచి...ఆ పోలికలు ఎక్కడికి పోతాయి? సాక్షాత్తు శివరావుమామయ్యని చూచినట్లే అనిపించింది నిన్ను చూచేసరికి. జ్ఞాపకముంటుందో ఉండదో అని ఆలోచించాను. కాని పూర్వకాలపువాడినికనుక ఏమయినా సరేనని సాహసించాను. అబ్బాయి..." అంటూ చెపుతున్నాడు.

పంతులు మాట కడ్డొచ్చి—"బండెక్కండి. ఇంటికేవెడదాం. తీరిగ్గామాట్లాడుకోవచ్చు" అన్నాడు.

"సరే, కానియ్యి...ఏదో చిన్ననాటి ఆప్యాయతవల్ల, పాతకాలంనాటి పల్లెటూరి చుట్టాన్నవడం వల్ల బస్తీచుట్టరికంగా కాకుండా సిద్ధమవుతున్నాను. మీయింటావి డేమనుకుంటుందో......" అంటూనే బండిలో ప్రవేశించాడు. డఫేదారు ముందు కెక్కడంతోటే బండి కదిలింది.

బండి నడుస్తున్నంతసేపూ పెద్దమనిషి మాట్లాడుతూనే ఉన్నాడు. శివరావుపంతులును గురించి, గంగమ్మను గురించి కమ్మని మాటలు చెపుతుంటే ఎన్నిసార్లు లోలోపల అనుకున్నా ఆపెద్దమనిషిపేరడగడానికి పంతులు సాహసించలేక పోయినాడు.

"ఏమిరోజులోయి అవి. ఆలాంటి మనుష్యులున్నారా ఈరోజుల్లో అంటాను. ఎక్కడో వేలు విడిచిన మేనమామమనమణ్ని స్వంతబిడ్డలా ఆదరించిన శివరావుమామ ధర్మదేవత కాడుటోయి. అంతకన్నా గొప్పమాట గంగమ్మత్తఔదార్యం. మహాయిల్లాలు. మీ సుందమ్మ, రాముడిపాటే నన్నూ చూచింది. వాస్తవానికి వాళ్లకన్న నన్నే ఎక్కువగా ఆదరించేది. ఒక్కొక్కప్పుడు నాకు ఇరుకాటంగా ఉండి 'ఏమత్తా' అంటే 'అవును నాయనా! మావాళ్లకి పెట్టినా పెట్టినట్లే, పెట్టకపోయినా పెట్టినట్లే. పరాయిపిల్లవాడికి అసౌకర్యం కలిగితే మాటమర్యాదలు దక్కుతాయా? సంసారాలువీథినిపడిపోవూ'........." అన్నట్లు రాముడికి ఎందరు పిల్లలు? సుందమ్మ బాగుందా? సుందమ్మభర్త బాగున్నాడా? పిల్ల లెందరు? వాళ్ల సంసారం నిండుగా ఉందికదా......అన్నట్లు హెడ్డక

వుంటు చేసిన ఆంజనేయులు పంతులు గారి రెండో కూతురు కమలమ్మనేకాదూ నీకిస్త? అబ్బ! నీపెళ్లికి రావడానికి ఎంతప్రయత్నం చేశానోయి. శుభలేఖలు వ్రాస్తూ రాముడూ, శివరావుమామాకూడా మరీమరీ రమ్మని వ్రాశారు. రావాలని సహస్రవిధాల ప్రయత్నం చేశాను. దిక్కుమాలిన జమ్మాబందీ మాఘమాసంలోనే తగులడుతుంది. ఎన్నివిధాల తంటాలుపడ్డా శలవుదొరికి చావందే! ఎప్పటి మాటో ... నీకు పిల్ల లెందరు అబ్బాయీ ?"

"ముగ్గురు. ఇద్దరు ఆడపిల్లలు, ఒక మగపిల్లవాడు. ఆడపిల్లలు పెద్దవాళ్లు. పెద్దదానికి పన్నెండేండ్లు; చిన్నదానికి పది; కుర్రవాడికి ఆరేళ్లు......"

"సరి! సరి! అయితే పిల్లలు పెళ్లికికూడా ఎదిగేరన్నమాటే...... మరి మీ ఆవిడ ఊరుకొంటోందా?"

పంతులుకు ఆపుకోలేని నవ్వు వచ్చింది. పెద్దవాళ్ల కెంత అనుభవమూ అనిపించింది. "క్షమించండి, మరచిపోయాను. తమ నామధేయం?" అని గొంతుకదాకా వచ్చిన ప్రశ్న ఆపెద్దమనిషి గ్రుక్కత్రిప్పుకోకుండా చేసిన కుశలసంభాషణవల్ల గొంతుకలోనే ఉండిపోయింది.

* * *

జట్కాబండి శంకర్రావుపంతులు గుమ్మంలో ఆగింది. పెద్దమనిషి ముందు దిగేడు. చిక్కం చేత్తో పుచ్చుకుని పంతులు దిగేడు. గుర్రపుబండి అలికిడి విని పిల్లలు పరుగెత్తుకుంటూ వీథిలో కొచ్చారు. డఫేదారు బట్టలు తీయడంతోటే పిల్లలు 'ఇదినాకు, ఇదినాకు' అంటూ ముట్టడించారు. వాళ్ల సంతోషాన్ని చూచి, ఆనందిస్తూ పంతులు నిలబడిపోయాడు. పెద్దమనిషి తిన్నగా కచేరీగదిలో సంచి పెట్టి వంటఇంటి ముందు భోజనాలశాలలోనికి ప్రవేశించి 'ఏమమ్మోయి కమలమ్మా' అని కేకవేశాడు. కొత్త గొంతుక కనిపెట్టి 'ఎవరువా'రంటూ గుమ్మంలో కొచ్చి గభాలున వెనక్కి తగ్గింది. ఆపెద్దమనిషి 'కమలమ్మా, అంత సిగ్గుపడక్కరలేదు. నేనేమీ పరాయివాడిని కాను. నువ్వునన్నెరుగవుకానినేను నిన్నెరుగుదును. చిన్నప్పుడు నేను మీనాన్న ఆంజనేయులుగారి దగ్గర పనిచేశాను. అప్పుడు నువ్వు చిన్నపిల్లవు. చిన్నప్పు డెన్నోసార్లు నిన్ను ఎత్తుకున్నాను. ఇప్పుడు పెద్దదాన వయ్యావు. పిల్లల తల్లివి. పైగా పెద్ద ఉద్యోగస్థుడి భార్యవు. ఇంతకీ రక్తసంబంధం కల మీఆయనే నన్ను మరచిపోయాడు. అల్లాంటప్పుడు నీకు జ్ఞాపకం లేకపోవడంలో ఆశ్చర్యంలేదు. అందుకనే నేనే వచ్చి పలకరించాను. ఇంతకీ వేళగానివేళ పట్నవాసంలో చుట్టపాడిని వచ్చాను. అందులోనూ పూర్వకాలపువాడిని. ఏదో కాస్త మడి, ఆచారం కూడాను."

"సరిసరి. ఎంతమాట. చాలాకాల మవడంచేత నేనెరుగకపోవచ్చును కాని, పెద్దలు మీరు చెప్పినప్పుడుకూడానా? దయచేయండి. స్నానం చేయండి. ఈవాళ ఆదివారం. అందుచేత నేనూ స్నానంచేసే వంట చేశాను. ఇంకా మా ఇంట్లో ఆచార వ్యవహారాలు తప్పడం లేదు. పైగా నేను మీరనుకొన్నట్లు అందరిమాదిరి ఉద్యోగస్థులభార్య ననుకొన్నారేమో. మీకే తెలుస్తుంది లెండి. అందులోనూ మీ చుట్టరికంమాటలా ఉండగా మాబాబయ్యగారి స్నేహితులాయిరి. బాబయ్యగారివంటివారే మీరున్నూ..."

"అన్నట్లు బాబయ్యగారు కులాసాగా వున్నారా?"

కమలమ్మకు గ్రుడ్లనీరు తిరిగేయి. పమిటి కొంగుతో నీరు తుడుచుకొని "బాబాయి పోయి సంవత్సరం దాటిపోయింది" అంది.

"అయ్యో అల్లాగా, నాకు తెలియనేలేదే. ధర్మరాజు. నా కెంత సాయంచేశాడు. చూశావా అమ్మా! అందుకే వస్తూ పోతూ ఉంటేనే చుట్టరికం, స్నేహం అన్నారు పెద్దవాళ్లు. చూడుమరి, అంత స్నేహంగా ఉండే ఆంజనేయులు పంతులుగారు పోతే నాకు ఏడాదిదాటినా తెలియలేదంటే ఏమనాలి..."

"ఔనండి. అంతే మరి. అందులోనూ బంధుత్వంలో మా వారు మరీ ఇదండి. ఎప్పుడూ కాసుల గొడవే కాని స్నేహితులు, బంధువులు—ఈ ప్రశంసే లేదు. వేసంకాలం శలవు లొస్తే ముందుగా పెద్ద ప్రోగ్రాం వేస్తారుకాని తీరా ముందు అగ్రహారం వెళ్లేక అక్కడనుంచి కదలరు. కొబ్బరితోట్లో బంగాళే బెంగళూరు, నీలగిరీ అంటారు. పొరుగూళ్లల్లోని బంధువుల నెవ్వరినీ ఎరుగరు. మొన్న ఈమధ్య మా పినతల్లి కొడు కొచ్చి 'బావగారూ' అని పలకరిస్తే నువ్వెవడవని అడిగేసరికి వా: డెంతో నొచ్చుకున్నాడు. గుమ్మంలోకొచ్చినవాడు వచ్చినట్టుగా వెళ్లిపోతూంటే నాకు తెలిసి నేనెంతో బ్రతిమాలినా భోజనానికున్నాడు కానేకాదు. నేనూ ఎన్నో సాళ్లు చెపుతూనే ఉన్నానండి..."

"సరేలే...కంప్లెయింటు చెయ్యడానికి బంధువు దొరికేడు—చూడు పంద్రెండుదాటింది, భోజనం సంగతి..."

"లేవండి. మీదే ఆలస్యం."

* * *

వంటమనిషికూడా ఆదివారం చేయడంవల్ల కమలమ్మే స్వయంగా ఆదరాబాదరాగా చుట్టపాయన పేరిట మరొక కూర చేసింది. నాలుగురకాల ఊరుగాయలూ వడ్డించింది. శంకర్రావు పంతులూ, చుట్టపాయనా భోజనం ఆరంభించారు. చుట్టపాయన భోజనం చేస్తున్నంతసేపూ ఆంజనేయులు పంతులుగారినిగురించో, శివరావుమామనుగురించో ప్రశంస చేస్తూనే ఉన్నాడు. దంపతు లిద్దరూకూడా ఆ ప్రశంసలతో పరమానందభరితులయ్యేరు. కమలమ్మ పెద్దకూతుర్ని పిలిచి "అమ్మాయీ, తాతగారికి రెండు చక్రకేళీపళ్లు పట్టుకురా"అని పురమాయించింది. అమ్మాయి చక్రకేళీపళ్లు పట్టుకొచ్చి వడ్డించింది. చుట్టపాయన వాటిని స్వీకరిస్తూ—"అమ్మాయికమలమ్మా! మరి వరాన్వేషణం జరుగుతోందా మనుమరాలికి? ఈకాలంలో ఆడవాళ్లు శ్రద్ధవహిస్తేనే మాటదక్కడం. శంకప్ప శలవు పెట్టి తిరిగితేగాని పనిజరుగదు..."

"మంచిమాట చెప్పేరు బాబూ. నే నెన్నివిధాల మొరలెత్తుకుంటున్నా వినిపించుకోవడం తేదు. సుందమ్మవదినకొడుకున్నాడు. వాళ్లకీ కావలసినంత ఆస్తి ఉందిగాని అబ్బాయికి ఆట్టే చదువు లేదు. ఊ......"

"ఆరంభించావూ గొడవ...ఆయన్ని భోజనం చెయ్యనియ్యవూ"

"ఇదేతరహా బాబూ! నే చెప్పితే వేళాకోళం. వారి కింకా చీమకుట్టడం లేదు. ఇంకోరెండుమూడేళ్లయినాకకదా అంటారు."

"అవునమ్మాయీ! ఆయన ఉద్యోగస్థుడు—ఆయనధీమా ఆలాంటిది. నువ్వేమో పూర్వకాలపు మనిషివిగనుక ఆదుర్దా పడుతున్నావు—"

"అంతేనండి......మరో చక్రకేళీపండు తేవే అమ్మాయీ ?"

"వద్దమ్మా...చాలు"

"చాలేమిటే? పిండివంటలా ఏమన్నానా? ఆగంతుకంగా వచ్చారు. ఏమి చేయడానికీ వీలులేక పోయింది—"

"దాని కేమిలే. మళ్లీ రాకపోతానా, నువ్వు చెయ్యకపోతావా...సరిసరి."

* * *

భోజనం అయింది. తాంబూలం సేవించి పెద్దమనిషి పడుకున్నాడు. ఫలహారానికి ప్రయత్నం చేస్తోంది కమలమ్మ. చుట్టపాయన కాస్త గుర్రుపట్టేక శంకర్రావుపంతులు లోపలి కెళ్లేడు.

"కమలం! ఈయ నెవరో నీకేమైనా గుర్తుందా ఏమి?"

"సరిసరి. మీకు ఒకవేలు విడిచిన మేనమామ కొడుకంటూ ఉంటే నన్నడుగుతారేమిటి?"

"ఆయనెవ్వరో నాకేమీ జ్ఞాపకంరావడంలేదు. ఎంత ఆలోచించినా తోచడంలేదు. కాని ధోరణి చూస్తే ఆయనకు మన అట్లు, పుట్లు, ఆనవాళ్లు

అన్నీ తెలీసున్నట్లు కనిపిస్తున్నాడు. పోనీ, తెగించి పేరడగనా?"

"బాగానే ఉంది. అప్రతిష్ఠకూడాను. అంత దగ్గరి చుట్టాన్ని పేరడిగితే ఏమనుకుంటాడు? బాగుంటుందా? మీ కంతా మరుపే. బాగా జ్ఞాపకం చేసుకోండి"

"జ్ఞాపకం రావడం లేందే?"

"పోనీండి. మాటల సందర్భంలో ఆయనే తేల్తాడు. నాకు ఆయన్నెప్పుడో చూచినట్లుందికాని మరేజ్ఞాపకం లేదు"

ఈసంభాషణ అయిన కొంతసేపటికి పెద్దమనిషి లేచాడు. కమలమ్మ ఫలహారం, కాఫీ ఇచ్చింది. ఆరెంటినీ ప్రశంసిస్తూ సేవించాడు. ఫలహార మైనతర్వాత మళ్లీ పురాణం ఎత్తుకున్నాడు. మాటల సందర్భంలో అవకాశం చూసుకొని తెగించి "తమ నామధేయం జ్ఞాపకం రావడం లేదు. కొంచెం శెలవిస్తారూ" అనడిగేడు చుట్టపాయన్ని పంతులుగారు.

"సరి సరి. చివరికి ఈకాడి కొచ్చింది. ఇంటికొస్తే నెత్తినెట్టుకునే మేనమామకొడుకింటి కెళ్లకుండా చిన్ననాటి ఆప్యాయతకొద్దీ ఉద్యోగస్థుడవుకదా అని మన్నించి పిలుపుపట్టుదల పెట్టుకోకుండా ఇంటికొస్తే పేరడిగేస్థితి కొచ్చింది వ్యవహారం. అమ్మాయీ కమలమ్మా! ఇక నే వెడతానమ్మా. పెద్ద ఉద్యోగస్థుల వ్యవహారం ఇంతటిదే. నిజానికి నీబోటి ఇల్లాళ్లు ఉన్నారు కనుకనే వాళ్ల మర్యాద ఇంకా సాగుతోంది"

"ఆయనమాట కేమిలెండి బాబుగారూ......
ఉండండి ఈపూటకూడా......"

"అమ్మాయి, చాలుచాలు, ఇక నే వెళ్లొస్తా. నీపిల్లలేరమ్మా? ఒక్కసారి చూడనియ్యి" అన్నాడు.

పిల్లలు ముగ్గురూ వచ్చి నిలబడ్డారు. ముగ్గురి చేతుల్లోనూ రెండేసి జామకాయలు పెట్టి గబగబా కోటు తొడుక్కొని అరుగు దిగేడు. పంతులు మాటాడడం లేదు. లోపలినుంచి గబగబా కమలమ్మ వచ్చేసరికి అప్పుడే చుట్టపాయన గుమ్మం దాటేడు.

"బాబుగారూ! బాబుగారూ" అంది కమలమ్మ.

"ఈసారి వచ్చినప్పుడు రెండురోజు లుంటాను. అప్పటికి మీఆయనకు నా పేరు జ్ఞాపకమొస్తుందేమో"

* * *

చుట్టపాయన మళ్లీ రాలేదు. దంపతు లెంత తర్జనభర్జన చేసినా ఆయనపేరు జ్ఞాపకం రాలేదు. ఉభయులూ ఇది ఘరానామోసం కాదుగదా అని కూడా తర్కించుకున్నారు.

చుట్టపాయన వెళ్లిపోయిన చాలారోజులదాకా పిల్లవాడుమాత్రం "అమ్మా! జామకాయలతాతయ్య మళ్లీ రాడే" అని అడుగుతూనే ఉన్నాడు.

"వస్తాడు నాయనా. మళ్లీ ఆదివారం వస్తాడు" అంటూనే ఉంది తల్లి.